## జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా ఎరువులు

-మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారిణి చంద్రకళ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో రైతులకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు, జిల్లా వ్యాప్తంగ 756.43మెట్రిక్ టన్నులు యూరియా స్టాక్ ఉన్నట్లు మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారిణి చంద్రకళ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పిఎసిఎస్‌ల వద్ద 111.105మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 189.855, మార్క్‌ఫెడ్ బఫర్‌లో 455.47 స్టాక్ ఉందన్నారు. శామీర్‌పేట, మేడ్చల్, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, కీసర మండలాల్లో వివిధ పిఎసిఎస్‌లు డీలర్లవద్ద యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రైతులు సమీప పిఎసిఎస్‌లు లైసన్స్‌ధారి ఫర్టిలైజర్ డీలర్లను సంప్రదించి తమ అవసరాలకు తగ్గట్టు యూరియా ఫర్టిలైజర్ పొందవచ్చన్నారు. ఫర్టిలైజర్లకు సంబంధించి స్టాక్‌ను ఎప్పటికపుడు పరిశీలిస్తూ రైతులకు అందుబాటులో యూరియా ఎరువులు ఉంచటం జరుగుతుందన్నారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## విద్యార్థినికి కరెంట్ షాక్

**మేడ్చల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** మేడ్చల్‌లోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న ఇంజనీరింగ్ విద్యార్థి కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదం విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. జడ్చర్లకుచెందిన రాజేశ్వరీ మేడ్చల్‌లోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహంలో ఉంటూ కండ్లకోయలోని సిఎంఆర్ ఐటిక్యాంపస్‌లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఆమెతోపాటు వివిధప్రాంతాం నుండి వచ్చిన 110మంది విద్యార్థినులు మేడ్చల్‌లోని ఈవసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. జనావాసాల మధ్య ఉన్న వసతిగృహ భవనం పక్కన, విద్యుత్‌స్తంభాలపై కరెంట్‌తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. మంగళవారం రాజేశ్వరి వసతిగృహంలో బట్టల ఆరేస్తుండగా గాలికి ఆమె చున్నీ ఎగిరి పక్కనే ఉన్న కరెంట్ తీగలపై పడగా, దానిని రాడుతో తీయడానికి ప్రయత్నించగా ఆమెకు కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఆమెతోపాటు లావణ్య, నందిని, రుచితకుకూడా స్వల్పంగా గాయాలపాలయినట్లు సమాచారం. వెంటనే తోటివిద్యార్థినులు, స్థానికులు స్పందించి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతున్నది. ఈఘటనతో విద్యార్థినులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కనబడుతున్నదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## వైకుంఠ ఏకాదశికి పోటెత్తిన భక్తులు

-వైకుంఠ ఏకాదశి పూజల్లోపాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, డిసిసి అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్



శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన ఎంపి ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
పోచారం డివిజన్ పరిధిలోని యంనంపేట్ శ్రీ గోదాదేవి సమేత శ్రీరంగనాథస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, రాష్ట్ర బిజెపి నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డిలతోపాటు పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. స్వామివారి ఆలయానికి తెల్లవారుఝామునుండే భక్తులు పెద్ద ఎత్తున క్యూలైన్లో బారులుతీరి నిల్చొని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఎల్.భాగ్యలక్ష్మితోపాటు కమిటీ చైర్‌పర్సన్ నర్రీ మంజులశ్రీశైలం, డైరెక్టర్లు పత్తెపుపోశెట్టి, శ్రీకాంత్‌గౌడ్, శ్రీలత, నాగార్జుననాయక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకుని పూజలుచేసిన వారిలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్, కాంగ్రెస్ నాయకులు సగ్గుశ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు నర్రీ కాశయ్య, పోలగోని రాజేశ్‌గౌడ్, బిజెపి మాజీకౌన్సిలర్ గొంగళ్ల మహేశ్‌కురుమ, నాయకులు గొంగళ్ల బాలేశ్‌కురుమ, పత్తెపు పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుహాల్స్‌ను ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి



కోర్టు హాల్స్‌ను ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్, పాల్గొన్న జిల్లా ప్రధానన్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ మనుచౌదరి తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా (ఉప్పల్) మేడిపల్లిలోని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆవరణలో మూడు కోర్టుహాల్‌లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ ప్రారంభించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ సమీపంలోని మేడిపల్లిలో ఉన్న అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆవరణలో కోర్టుహాల్స్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పాల్గొని హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వారితోపాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు



కొందుర్గులో స్వామివారి ఊరేగింపు



కాకునూరు హనుమాన్ దేవాలయంలో



రావల్‌కోల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో



నందిగామలో శ్రీనివాసుడి ఊరేగింపు



స్వామివారిసేవలో స్పెషల్ సిఎస్ నవీన్‌మిట్టల్



అనంత పద్మనాభస్వామి ఆలయంలో



ఎదులాబాద్ రంగనాయకస్వామి ఆలయంలో

**కొడంగల్‌లో...**

**కొడంగల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులసందడితో కిటకిటలాడాయి. స్థానిక శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వర దేవాలయంలో ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం వేకువజాము నుంచి తిరుమల తిరుపతి దేవాలయ అర్చకులు శ్రీబాలాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టువారి సౌజన్యంతో కొడంగల్ శ్రీవేంకటేశ్వర ఆలయంలో శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచార్యులతో ఆస్థాన విద్వాంసులతో తిరుప్పావై పారాయణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీఅభయాంజనేయస్వామి, సిద్దనొంపు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు చేసారు.

**కొందుర్గులో...**

**కొందుర్గు, జిల్లెడుచౌదరిగూడ, డిసెంబరు30, ప్రభాతవార్త:**
వైకుంఠ ఏకాదశి వేడుకలను కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడ మండలాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా తయారుచేసిన పల్లకిపై స్వాములను ఉత్తరద్వారం ద్వారా శోభయాత్రతీశారు. కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, గ్రామసర్పంచులు చౌడాపురం ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ చేవెళ్ల కృష్ణయ్య, ధర్మకర్తలు నరసింహులు, జగ్గమ్మల బాలరాజు, శీలం వేణుగోపాల్, చిప్ప అమర్‌లింగం రాజేష్ పటేల్, కావలి యాదయ్య, చంద్రశేఖర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**కాకునూరు గ్రామంలో...**

**కేశంపేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
వైకుంఠ ఏకాదశిని కాకునూరు గ్రామంలో గురుబోధ రంగయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొమ్మిది రేకుల కిషన్ ప్రభుగీతప్రచారసమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ ఆధ్వర్యంలోని మహిళావిభాగం సభ్యులు జట్టూరి అలివేలమ్మ, ప్రేమమ్మ, సరస్వతి, రాములమ్మ, లక్ష్మమ్మ, నాగమ్మ, నర్సింహారెడ్డి, సంతోష్ కుమార్‌చారి, అంజయ్యచారి, గుత్తి రంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, నిర్దవెల్లి గీతభక్తులు, హరికిషన్‌రెడ్డి, శంకర్‌జీ, గ్రామ అధ్యక్షులు, పెద్దలు మల్లారెడ్డి, జంగారెడ్డి, శంకర్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

**మేడ్చల్‌లో...**

**మేడ్చల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మేడ్చల్ మండల పరిధి రావల్‌కోల్ గ్రామంలోని జయదర్శిని టౌన్‌షిప్‌లోగల శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా ఘన్‌పూర్ క్షేత్రగిరి గుట్టపైగల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా వైకుంఠ ఏకాదశిని నిర్వహించారు.

**నందిగామలో...**

**నందిగామ, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
నందిగామ మండలకేంద్రంలోని శివరామాంజనేయస్వామి దేవాలయంలో శ్రీనివాసుని ఉత్తర ద్వారం నుండి దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో షాద్‌నగర్ మాజీ ఎఎంసి చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, సర్పంచ్ కొమ్ము కృష్ణ, మాజీ సర్పంచ్ వంగిపురం నీలమ్మ, ప్రముఖ న్యాయవాదులు ఎం.రవీందర్‌కుమార్, చెంది మహేందర్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ నర్సింలు, బి.రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వార్డుసభ్యులు అగ్గి ప్రసాద్, అగ్గి మమతాసూరి, దార సురేష్, బొమ్మగల నరసింహులు, శివగళ్ల ప్రవీణ్, గ్రామస్థులు బోర్ర జంగయ్య, బలిజ లింగం, పిట్టల రాములు, జె.చంద్రశేఖర్, అంతయ్య, నోకియా, మంగలి సాయి తదితరులు ఉన్నారు.

**అలియాబాద్ చౌరస్తాలో...**

**శామీర్‌పేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
వైకుంఠ ఏకాదశి సందర్భంగ రత్నాలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని వేలాదిగా విచ్చేసిన భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు, శివాలయంలో, శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో, దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, శామీర్‌పేటలోని రామాలయంలోనూ వేలాదిభక్తులు దర్శనం చేసుకున్నారు.

**కీసరలో...**

**కీసర, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
చీర్యాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా నగరం నలుమూలల నుండి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. విఐపిల రాకను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

**బంట్వారంలో...**

**బంట్వారం, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
బంట్వారం-కల్‌కోడ గ్రామ శివారులో ఉన్న శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయానికి ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో మండలంలోని పలు వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఘట్‌కేసర్‌లో...**

**ఘట్‌కేసర్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఘట్‌కేసర్ పరిధిలోని పలు వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఘట్‌కేసర్ వేమనానగర్‌లోని శ్రీవిజయ వేంకటేశ్వరస్వామి ఆలయం, గీతామందిర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎన్ఎఫ్‌సినగర్‌లోని విశ్వేశ్వరగిరిక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నార్ రంగనాయకస్వామి, శ్రీవేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో భక్తులు స్వామిదర్శనం చేసుకొని ప్రత్యేక పూజలుచేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణి కుటుంబసమేతంగా విచ్చేసి ఎదులాబాద్‌లో రంగనాయకస్వామి, వేణుగోపాల స్వామిని దర్శించుకొని పూజలుచేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

## ఇరువురి యువకుల మధ్య ఘర్షణ..కత్తితో దాడి

**కొడంగల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ఇరువురు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో కత్తితో దాడిచేసిన సంఘటనలో తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం కొడంగల్ పట్టణంలో చోటుచేసుకుంది. దాడికి సంబంధించి ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువురు యువకులు ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో ఓయువకుడు మరోయువకుడిపై కత్తితో దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శామీర్‌పేట పెద్దచెరువులో మృతదేహం గుర్తింపు

**శామీర్‌పేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
శామీర్‌పేట పెద్దచెరువులో నీటిపై ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో శామీర్‌పేట పెద్దచెరువులో నీటిపై మృతదేహం తేలి ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ నివాసి సర్వ చిరంజీవి (45) ఇంటర్‌నెట్ షాపును నడుపుకుంటున్నారు. అయితే ఈ నెల 24న తాను గోవాకు వెళ్తున్నట్లు భార్యకు చెప్పి గజ్వేల్‌లోని తన ఇంటి నుంచి ఆయన బయలు దేరినట్లు తెలిపారు. అయితే ఈ నెల 27న చిరంజీవి మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావటంతో అతని ఆచూకీ కోసం వెతికినప్పటికీ సమాచారం లభించలేదన్నారు. దీంతో ఈ నెల 27న గజ్వేల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసును నమోదు చేయటం జరిగిందన్నారు. అయితే 30న మంగళవారం మధ్యాహ్నం శామీర్‌పేట పెద్ద చెరువులోని నీటిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించటంతో శామీర్‌పేట పోలీసులు ఈవిషయాన్ని చిరంజీవి అల్లుడు అయిన మహాంకాళి ఉదయ్‌కుమార్‌కు సమాచారం ఇవ్వగా అతను సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, ఈ మృతదేహం తన మామ సర్వ చిరంజీవి అని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఆర్థిక కారణాలు లేదా ఇతర కారణాల వల్ల మనస్తాపానికి గురై మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం అవుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తొమ్మిది ఏళ్ల తరువాత తీర్పు

-హత్య, అత్యాచారం, పోక్సో కేసులో జీవిత ఖైదు
-నిందితుడికి రూ.21000 జరిమాన
-బాధితురాలికి ఐదులక్షల పరిహారం

**మొయినాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
హత్య, అత్యాచారం పోక్సో కేసులో రాజేంద్రనగర్ కోర్టు నిందితునికి జీవితఖైదు శిక్షను విధించింది. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య, అత్యాచారం, పోక్సో కేసులో వడ్ల సంతోష్ (24)కు యావజీవ కారాగార శిక్షణను వేసింది, దాంతో పాటు 21000 రూపాయలు జరిమానా విధించబడింది, మొయినాబాద్‌లోని చిల్కూర్‌కు చెందిన కొండిగారి మహేందర్, సురేకల కుమారుడు, రోహన్‌కుమార్ (9)(చక్రి) 2016లో డిసెంబరు నాలుగో తారీఖున సంతోష్ అనే వ్యక్తి ఇందిరమ్మ క్వాటర్స్‌లో రోహన్ అనే బాలుడిని హత్యచేసి వాటర్ ట్యాంకుటో సింటెక్స్‌లో పడేసినారు. ఈవిషయంపై కోర్టులో కేసు నడుస్తుండగా మంగళవారం న్యాయస్థానం కేసులోని పూర్వపరాలను పరిశీలించి తీర్పును వెలువరించింది. రాజేంద్రనగర్‌లోని అత్యాచారం, పోక్సో చట్టం కేసుల విచారణ, పరిష్కారం కోసం గౌరవనీయ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయముర్తి అంజనేయులు ఈ తీర్పును వెలువరించారు, నిందితుడు వడ్ల సంతోష్ తండ్రి కనకప్ప, వృత్తి: చీరెల వ్యాపారం, శాంతినగర్, దామరిగిద్ద (గ్రా) మండలం, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తిపై క్రైమ్‌నెం: 361బై2016 సెషన్స్ కేసు నెం 302బై2018 సెక్షన్ల 377,364,(ఎ),201,302 ఐపిసి సెక్షన్ 5ఆర్,డబ్ల్యు.6 పోక్సో చట్టం 2012 మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సైబరాబాద్ ప్రాసిక్యూషన్, ప్రబ్లిక్ ప్రాసిక్యూటర్: జి.వి రామ క్రృష్ణరావు, సెల్‌నెం: 9701335796, దర్యాప్తు అధికారి జి.శ్రీనివాసులు, ఎసిపి, ఫోన్: 9908832999, ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఫోన్ నెం. 9490617188 చిల్కూర్.

# చెక్‌పవర్‌తో ఉపసర్పంచులకు పెరిగిన క్రేజ్

-సర్పంచితో సమానంగా లభించనున్న కీలక ప్రాధాన్యత
-సర్పంచులకు తలనొప్పిగా మారిన జాయింట్ చెక్‌పవర్..?

**(నందిగామ, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వారికి అనూహ్యమైన క్రేజ్ లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో మెరుగైనపాలన అందించాలనే ఉద్దేశంతో ఉపసర్పంచులకు చెక్ పవర్ ఇవ్వడంతో ఉపసర్పంచులకు బూస్ట్ ఇచ్చినట్లయింది. ఉపసర్పంచ్‌గా గెలిచిన వారందరికీ బాధ్యతపెరిగి రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆయా గ్రామపంచాయతీల్లో అధికార సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు సర్పంచ్ కేంద్రంగా సాగిన గ్రామపాలన, ప్రస్తుతం సర్పంచి, ఉపసర్పంచుల సంయుక్త అధికారవ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ఈ మార్పుకు ప్రధాన కారణం జాయింట్ చెక్‌పవర్ అమలువిధానం. ఇది సర్పంచులకు కొత్త సవాలును తెరపైకి తీసుకొచ్చింది. పంచాయతీ ఖాతాల నుండి నిధులు విడుదల కావాలంటే సర్పంచ్‌తోపాటు ఉపసర్పంచి సంయుక్త సంతకం తప్పనిసరికావడంతో ఉపసర్పంచి పాత్ర కేవలం ప్రతిష్ఠాత్మకంగాకాకుండా నిర్ణయాత్మకంగా మారింది. అభివృద్ధి పనుల బిల్లులు, కాంట్రాక్టు బిల్లులు, చెల్లింపులు, ఖర్చుల అనుమతి వంటి అంశాల్లో ఉపసర్పంచ్ సంతకంలేకుండా పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

**ఎన్నికలవేళ పెరిగిన పోటీ..**

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉపసర్పంచి పదవుల కోసం గట్టి పోటీ కనిపించింది. గతంలో సర్పంచ్ ఎన్నికలకే పరిమితమైన రాజకీయ చర్చలు, ఇప్పుడు ఉపసర్పంచి స్థానాల పైకి మళ్ళాయి. కొన్ని గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులకోసం ముందుగానే రాజకీయ ఒప్పందాలు వర్గాలమధ్య లావాదేవీలు జరిగినట్లు సమాచారం.

**ఉపసర్పంచ్ పదవికి పెరిగిన విలువ...**

జాయింట్ చెక్‌పవర్ వల్ల ఉపసర్పంచులకు సర్పంచులతోపాటు సమానహోదా లభిస్తుండడం కొందరు సర్పంచులకు తలనొప్పిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సర్పంచులకు పెరుగుతున్న అసంతృప్తి...**

జాయింట్ పవర్ సర్పంచులకు తలనొప్పిగా మారిందని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తమకు వ్యతిరేకంగా ఉన్న ఉపసర్పంచులు చెక్ పవర్ సంతకాన్ని అడ్డుపెట్టి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారనే అపవాదు సర్పంచులకు లేకపోలేదు. పనులు ఆలస్యం అవ్వడం, బిల్లులు పెండింగ్లో పడడం, ప్రజల అసంతృప్తి సర్పంచులపై పడటం వంటి పరిస్థితులు తలెత్తనున్నాయి.

**ప్రభుత్వ లక్ష్యాలు.. పారదర్శకత...**

ప్రభుత్వం ఈవిధానాన్ని ప్రవేశపెట్టిన ప్రధాన ఉద్దేశం.. నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే. ఒకరి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా ప్రజాధనం సక్రమంగా వినియోగం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు.

**మేధావుల అభిప్రాయాలు...**

జాయింట్ చెక్ పవర్ వల్ల ఉపసర్పంచులకు అనూహ్యమైనక్రేజ్ పెరగడంతోపాటు గ్రామపాలనలో కొత్త రాజకీయ సంక్షోభాలకు బీజంపడిందని అంటున్నారు. ఈవ్యవస్థ గ్రామాభివృద్ధికి దోహదపడుతుందా..? లేక రాజకీయ విభేదాలకు దారి తీస్తుందా..? అన్నది రానున్న రోజుల్లో స్పష్టం కానున్నదంటున్నారు.

## ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా సుధీర్‌బాబు

-22 స్టేషన్‌తో కమిషనరేట్ ఏర్పాటు
-3డిసిపి, 6ఎసిపి కార్యాలయాలు



బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సుధీర్‌బాబు

**రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్‌గా మంగళవారం సాయంత్రం సుధీర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈసందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లను ఏర్పాటుచేయడం జరిగిందని, అందులో భాగంగా మంగళవారం ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో తమవంతు బాధ్యతలను నిర్వహిస్తామని అన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**మూడు డిసిపి కార్యాలయాలు...**

జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో మహేశ్వరం, మొయినాబాద్, షాద్‌నగర్ డిసిపిలను కేటాయించారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, మొయినాబాద్, ఆమన్‌గల్లు, షాద్‌నగర్‌లకు ఎసిపిలను కేటాయించారు. ఇబ్రహీపట్నం ఎసిపిపరిధిలోకి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మహేశ్వరం ఎసిపి పరిధిలో కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, ఫార్మసిటీ, చేవెళ్ల ఎసిపి పరిధిలోకి చేవెళ్ల, మోకిళ్ల, శంకర్‌పల్లి, ఆమన్‌గల్లు ఎసిపి పరిధిలోకి ఆమన్‌గల్లు, మాడ్గుల, కేశంపేట్, తలకొండపల్లి, షాద్‌నగర్ ఎసిపి పరిధిలో చౌదరిగూడెం, కొందుర్గ, కొత్తురు, నందిగామ, షాద్‌నగర్‌లు కేటాయించారు. మహేశ్వరం డిసిపి పరిధిలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మొయినాబాద్ డిసిపి పరిధిలో చేవెళ్ల, మొయినాబాద్, షాద్‌నగర్ డిసిపి పరిధిలో ఆమన్‌గల్లు, షాద్‌నగర్‌లు కేటాయించారు. దీంతో నూతనంగా ఏర్పడిన ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా సుధీర్‌బాబు బాధ్యతలు చేపట్టడం జరిగింది.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నరేశ్‌గౌడ్



తిరుమలలో సిఎం రేవంత్‌రెడ్డితో కొమురవెల్లి డైరక్టర్ నరేశ్‌గౌడ్

**ఘట్‌కేసర్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని మంగళవారం కొమురవెల్లి ఆలయ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్ కలిసి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన కొమురవెల్లి దేవస్థాన బోర్డు సభ్యులు నరేశ్‌గౌడ్ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని నరేశ్‌గౌడ్ సిఎంతో చెబుతూ ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. ప్రధాన ఆలయాల వద్ద కిలోమీటర్ల మేర భక్తులు క్యూ లైన్‌లలో బారులు తీరారు.


శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి సేవలో భక్తులు


పెరుమాల్ దేవాలయంలో పూజలు చేస్తున్న ముప్పిడి మధుకర్


కార్వాన్ రామ్‌సింగ్‌పుర శ్రీబాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఠాకూర్ జీవన్ సింగ్.


హైదర్షాకోట్‌లోని నర్సిహ్మస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాది వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత పి.కృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ దంపతుల దృశ్యం.


జూబ్లీహిల్స్ టిటిడి దేవాలయం ఉత్తర ద్వారం వద్ద బారులు తీరిన భక్తులు


శ్రీ వివేకానంద్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజల్లో పాల్గొన్న అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి దంపతులు


ముక్కోటి ఏకాదశి సందర్భంగా రంగనాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మండలి జై రాజ్.


ముక్కోటి ఏకాదశి సందర్భంగా పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


వైకుంఠ ఏకాదశిన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు చేసిన కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్


ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి సేవలో బండి రమేష్


వైకుంఠ ఏకాదశి ని పురస్కరించుకుని సికింద్రాబాద్ లోని నామాల గుండు లో గల శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఇతర బీజేపీ నేతలు.


పాండురంగ వితలేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు


గుడిమల్కాపూర్ విశ్వేశ్వర్‌నగర్‌లోని రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్


గంధంగూడలోని జ్ఞాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైంకుఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.


వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా ఉప్పర్ పల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, యమున రెడ్డి ,కుమారుడు తేజ్ పాల్ రెడ్డి, కోడలు అఖిల, మనవరాండ్లు నైనిక రెడ్డి, త్రిద రెడ్డి లు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో స్వామి వార్లను దర్శించుకున్న ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌వర్మలను సన్మానిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ మహేష్ గౌడ్

## కారు డోరు తీయడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** అకాస్మత్తుగా కారు డోరు తీయడంతో వెనుక వచ్చిన వాహనదారుడు గాయపడిన సంఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదర్‌నగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి నవీద్ బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని లోటస్ పాండ్ వద్ద తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో ముందు నిలిపిన ఒక ఇన్నోవా వాహనం డోరు ఆకస్మాత్తుగా తీయడంతో వెనుక నుంచి వాహనంపై వచ్చిన నవీద్ వాహనం డోర్‌కు తగిలి కిందపడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయలవ్వగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అతనితోపాటు నాగరాజు అనే మరో వ్యక్తికి సైతం గాయలయ్యాయి. ఈ సంఘటనపై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బోరబండలో మినీ టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

**జూబ్లీహిల్స్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** బోరబండలో మినీ టిప్పర్ ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన కరీముద్దీన్(57) మంగళవారం బోరబండ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఒక స్టా రిపేర్ దుకాణానికి వచ్చాడు. స్టా రిపేర్ చేయించుకొనే క్రమంలో అటుగా వచ్చిన ఒక మినీ టిప్పర్ ఒక్కసారిగా అదుపుతప్పి స్టా రిపేర్ దుకాణం మీదకు దూసుకొచ్చింది. అక్కడే ఉన్న రెండు వాహనాలను ఢీకొట్టుకొని వచ్చి అక్కడే ఉన్న కరీముద్దీన్‌ను ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్టా రిపేర్ దుకాణదారు అయిన యూసుఫ్‌కు గాయలవ్వగా అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా బ్రేకులు ఫెయిల్ కావడం వల్ల ప్రమాదం చోటుచేసుకున్నట్లు వాహన డ్రైవర్ రాజు పోలీసులకు తెలిపారు. పోలీసులు రాజుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించలేదని గుర్తించారు. పోలీఉసలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీనియర్ జర్నలిస్టు టికె లక్ష్మణరావు మృతి

**సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** సీనియర్ జర్నలిస్టు, మఫసిల్ స్పెషలిస్ట్‌గా పేరుగాంచిన టికె లక్ష్మణరావు (70) ఇక లేరు తెలుగు పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని రాసుకున్న లక్ష్మణరావు గత కొంత కాలంగా ఆనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్ స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. 1954లో తూర్పుగోదావరి జిల్లాలో జన్నించిన లక్ష్మణరావు పిఠాపురంలో ఇంటర్, డిగ్రీ వరకు చదివారు. ఆయన పిహెచ్‌డి కూడా చేశారు. రాజకీయాలంటే ఎంతో ఇష్టం ఉండటంతో ఉదయం పత్రికలో అవకాశం రావడంతో 1984 లో చేరారు. ఉదయం, ఆంధ్రభూమి, వార్త, సాక్షి దినపత్రికల్లో వివిధ పోస్టులలో కీలకబాధ్యతలు నిర్వహించారు. బుధవారం గోపన్నపల్లిలోని జర్నలిస్టుల కాలనీ ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. లక్ష్మణరావు మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.పాండురంగారావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## ప్రజాసేవ లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్

-తొమ్మిది రోజులపాటు ఉచిత కంటి పరీక్ష శిబిరం
-5500 మంది హాజరు ,3800 మందికి పరీక్షలు
-148 మందికి ఉచిత ఆపరేషన్


సమావేశంలో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.


ఆపరేషన్లు లబ్ధింపొందిన వారితో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.

**ఆమనగల్లు, (మాడ్గుల) డిసెంబరు 30, ప్రభాతవార్త:** ప్రజాసేవ పరమావధిగా ఐక్యత ఫౌండేషన్ ఆవిర్భవించిందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఉచిత కంటి మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని కల్వకుర్తి నియోజకవర్గంలో నాలుగు మెగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. మాడుగుల మండలంలో తొమ్మిది రోజులపాటు నిర్విరామంగా సాగిన ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు వేడుకలకు సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అన్ని మండలాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలతో పేదలు ఉచితంగా కంటి పరీక్షలు పొంది అవసరమైన వారికి అద్దాల పంపిణీ, కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్య ఉద్యోగ ఉపాధి కల్పనకు ఐక్యత ఫౌండేషన్ విశేషంగా కృషిచేసి సఫలం అవుతున్నట్టు రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు గ్రామాలలోని దేవాలయాలను అభివృద్ధి చేపడుతున్నట్లు అయిన వివరించారు. చెన్నై నగరానికి చెందిన శంకర్ నేత్రాలయ వైద్యశాల సహకారంతో మాడుగుల మండలంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి మంచి స్పందన లభించిందని, దాదాపుగా 5500 మంది హాజరు కాగా 3800 మంది తమ నేత్రాల ఆరోగ్య పరీక్షలు పొందారన్నారు. వీరిలో నేత్రాలను 143 మంది దృష్టిలోపంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కంటి వైద్య నిపుణులు గుర్తించి వారికి అవసరమైన ఆపరేషన్లను ఉచితంగా నిర్వహించామని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. అలాగే 2600 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు సుంకిరెడ్డి తెలిపారు.ఇప్పటి వరకు నియోజక వర్గ వ్యాప్తంగా 56 8 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేశామని,10వేల మందికిపైగా ఉచితంగా కంటి అద్దాల, పంపిణీ చేశామని సుంకిరెడ్డి వివరించారు. అంతకుముందు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ముగింపు వేడుకలకు హాజరు కాగానే వృద్ధులు భావోద్వేగానికి గురై సంకిరెడ్డిని హత్తుకున్నారు.

ఈ కార్యక్ర మంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి , సుంకిరెడ్డి సుభాషిణి ,శంకర నేత్రాలయ వైద్యులు డా. ఆర్తీ రాజ్ కుమార్ , రాజీవ్ కుమార్, ఇంచార్జ్ బాను ప్రకాష్ రెడ్డి , ఐక్యత మాడుగుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి, సబ్యులు నాగిళ్ళ శివ, ఎరుకలి శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో దోమల బెడద తొలగించాలని డిసికి వినతి

- డిసి కృష్ణమోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ప్రతినిదుల బృందం

**నార్సింగి, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల పరిధుల్లో దోమల బెడద తీవ్ర రూపం దాల్చిందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు వంశీ, ఇతర ప్రతినిధుల బృందం డిసి కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల పరిధుల్లో ఆమోదించబడి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని డిసిని కోరామన్నారు. అలాగే ఆక్రమణలను తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. చెరువుల నుంచి వచ్చే డ్రైనేజి నీటిని మళ్లించినట్లు డిసి తెలిపారని, దీంతో దోమల వృద్ధి ఆగిపోతుందని వివరించారన్నారు. ఓపెన్ డ్రైనేజి కాలువలు, చెరువులలో దోమల వృద్ధి నిర్మూలన కోసం దోమ లార్వాలను నాశనం చేసేందుకు మందులు పిచికారి చేయాలని కోరినట్లు వంశీ వివరించారు. మేము డిసి దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని డిసి హామీనిచ్చారని వంశీ తెలిపారు.

## నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్ల స్వాధీనం

### గోవా, ఢిల్లీ నుంచి తరలిస్తున్న వైనం


మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న నాన్ డ్యూటీ మద్యం బాటిల్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రంగారెడ్డి జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు సరూర్ నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ నుంచి వచ్చే వాహనాలపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గోవా, ఢిల్లీ రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 229 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి 12 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం రవాణాను పూర్తిగా అడ్డుకునేందుకు నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బాడీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శిని కలిసిన సతీష్ గుప్త

**కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కోరుతూ కంటోన్మెంట్ 5వ వార్డుకు చెందిన సామాజి కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త రక్షణ శాఖ సంయుక్త కార్యదరిశ రాఖేష్ మిట్టల్‌కు వినతిపత్రం అందజేశారు.

## కంటోన్మెంట్ బోర్డును జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి : వికాస్‌మంచ్

**కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేసిన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ మంగళవారం రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాఖేష్ మిట్టల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ కమిటీ ప్రతినిధులు గిరి, అంబాల శ్రీను, ప్రభుగుప్త, పసి తదితరులు పాల్గొన్నారు. ఈ అంశంపై బోర్డు సిఈఓ అరవింద్ ద్వివేది,బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదలకు వినతిపత్రం అందజేశారు.

## సిఎం ప్రజావాణి చొరవతో గ్రూప్-3 ల్యాబ్ టెక్నీషియన్లకు ఉద్యోగాలు

..చిన్నారెడ్డిని సన్మానించిన అభ్యర్థులు


చిన్నారెడ్డిని శాలువాతో సత్కరించిన ల్యాబ్ టెక్నీషియన్లు.

**బేగంపేట డిశంబరు 30,ప్రభాతవార్త** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డిని పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్3 ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థులు పరిక్షా ఫలితాలు త్వరిత గతిన వెలువడి ఉద్యోగాలు లభించడంతో డా.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లను వారు శాలువాలతో సన్మానించారు. తమకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు.తమకు ఉద్యోగాలు లభించేలా కృషి చేసిన సీఎం ప్రజావాణీ బృందానికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## క్రీడాకారులకు బహుమతులు అందజేత



**జీడిమెట్ల, డిసెంబర్ 30, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ మైనార్టీ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ టోర్నమెంట్లో పాల్గొని గెలుపొందిన వారికి మంగళవారం గాజులరామారం ఆక్సిజన్ పార్క్ పరిధిలో స్పోర్ట్స్ క్లబ్‌లో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి గురుస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి నవాబ్ భాయితో కలిసి బహుమతులను అందజేశారు.

## వైభవంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ


అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్

**ముషీరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి భోలక్‌పూర్ డివిజన్‌లోని శ్రీనివాస గ్రౌండ్స్(ఘంటసాల గ్రౌండ్స్)లో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్, కాంగ్రెస్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రాం, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, గొలిపుర కార్పోరేటర్ ఆలె భాగ్యలక్ష్మి భాస్కర్, నల్లకుంట కార్పోరేటర్ వై.అమృత, కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ తదితరులు పాల్గొన్నారు. పూజ నిర్వాహకులు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్ దంపతులు అతిధులను ఆత్మీయంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం


హరిహర క్షేత్రంలో శ్రీవారి భక్తులకు పాలు పంపిణి చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రం వేలాది మంది భక్తులు పోటెత్తారు. దేవాలయం ప్రాంగణం గోవింద నామస్మరణలతో దద్దరిల్లింది. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి సేవలో రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎసిపి శ్రీనివాస్, డిప్యూటి కమిషనర్ సురేందర్‌రెడ్డి, ముత్తు యాదవ్ తదితరులు పాల్గొనగా తెలంగాణ విద్యార్థి జెఎసి ఛైర్మన్ వేముల రామకృష్ణ భక్తులకు బాదం పాలును పంపిణి చేశారు.

## నూతన సినిమాని ప్రాంభించిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్..


క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** కూకట్‌పల్లిలోని గోపాల్ నగర్‌లో అనన్య క్రియేషన్ వారి భద్రం సి-కేర్ఫుల్ బ్రదర్ అనే నూతన సినిమా సూటింగ్‌ని మంగళవారం కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సినిమాలో హీరోగా నటిస్తున జనసైనికుడు నరేష్ రాయల్‌ని, దర్శకుడు జక్కన్నని, సినీ బృందాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశ పెట్టుకోకుండా అందరూ కలసి స్వయం ఉపాధిగా నిర్మించిన సందేశాభిముఖీ చిత్రాలను ప్రజలు ఆదరించాలని కోరుకుంటు ఈ సినిమాలో జనసైనికుడు హీరోగా నరేష్ రాయల్ నటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయంలో ఘనంగా 34వ వార్షికోత్సవ వేడుకలు


అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న వడ్డేపల్లి యామిని దంపతులు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 34వ వార్షికోత్సవ మండల పూజల సందర్భంగా 5వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులచే లక్ష్మీ మ గణపతి ఆలయంలో నవకలశ స్థాపన అభిషేక ము తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయిబాబా స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, అభ్యంజనేయ స్వామి ఆలయాలలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా అయ్యప్ప స్వామి వారికి 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకము వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాలలో కాలనీవాసులు, ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు. అలాగే సాయంత్రం స్వామివారిని ఏనుగు అంబారీపై కూకట్‌పల్లి పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువెళ్లగా పెద్ద సంఖ్యలో భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని వీక్షి ంచారు.

## లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో మర్రి పూజలు

**బేగంపేట డిసెంబరు 30,ప్రభాతవార్త** స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ,సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి,బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధరరెడ్డి అన్నారు.వైకుంఠ ఏకాదశి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని జనరల్ బజార్‌లోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో మర్రి ప్రత్యేక పూజలు చేసారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సందీప్‌వర్మ, సి.కె.నర్సింగరావు,వజనాల దయానందరావు,ఆకుల రమేష్ కుమార్,పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**
వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, చెల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 113/అ గల వ్యవసాయ భూమి యొక్క యజమాని గరిశెట్టి దామోదర తండ్రి పెద్ద నర్సప్ప నా యొక్క భూమిని విక్రయించడానికి సిద్ధమైతిని. ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో తెలియజేయగలరు.



శ్రీధర్‌శర్మకు నామప్రచార శిరోమణి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

## శ్రీధర్‌శర్మకు నామప్రచార శిరోమణి పురస్కార ప్రదానం

**మర్కుక్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను మండల పరిధిలోని పాండురంగ ఆశ్రమంలో మంగళవారం వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. 80గ్రామాలకు చెందిన భగవత్ సేవా సమాజం శాఖల సమ్మేళనం అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో కీలకంగా వ్యవహరించిన ఆదరాసుపల్లి శ్రీధర్‌శర్మకు ఆశ్రమం తరపున నామప్రచార శిరోమణి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఆయా గ్రామాల ప్రతినిధులు శ్రీధర్‌శర్మ కృషిని కొనియాడారు. ఇదిలా వుండగా భావానందపూర్ గ్రామ సర్పంచ్ సత్తమ్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువత పెద్దఎత్తున పాండురంగ ఆశ్రమానికి చేరుకొని గురు పుత్రులు అయిన అప్పాల సత్యనారాయణశర్మ, విఠలశర్మ, రసరాజశర్మలను ఘనంగా సన్మానించి గురువందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



మర్కుక్‌లో శ్రీ రంగనాయకస్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**మర్కుక్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మర్కుక్‌లోని శ్రీరంగనాయకస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం శ్రీరంగనాయకస్వామి వారి శోభాయాత్రను గ్రామవీధుల్లో నిర్వహించగా స్వామివారి నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.రాణి మల్లేశం, ఉపసర్పంచ్ మహేష్, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో...**

**కొండపాక, డిసెంబరు 30, ప్రభాతవార్త :** వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) సందర్భంగా మంగళవారం కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని దేవాలయాల్లో భక్తులు ఉత్తరద్వారా దర్శనం చేసుకొని మొక్కులు మొక్కుకున్నారు. కుకునూరుపల్లి రామాలయంలో, అనంద నిలయంలోని వెంకటేశ్వరాలయంలో, దుద్దెడ, సిర్సనగండ్ల, కొండపాక తదితర గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో వెళ్ళి దైవ దర్శనం చేసుకున్నారు.

## హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కాపర్తి నవ్యశ్రీ నవీన్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, పత్తిని లక్ష్మయ్య, గంగిశెట్టి ఉమేష్, కైలాస ప్రశాంత్, స్వాతి, శ్రీను, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్




డిపిఓ రవీందర్‌ను సత్కారిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

**కొమురవెల్లి, డిసెంబరు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్(డిపిఓ) రవీందర్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీర్వాదాలు పొందిన అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఎంపిడివో, సర్పంచ్ గొల్లపల్లి పద్మ, అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** టిపిటిఎఫ్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం గజ్వేల్ ఐఓసి కార్యాలయంలో ఆర్డీవో చంద్రకళ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంఈవో కృష్ణ, టిపిటిఎఫ్ జోన్ కన్వీనర్ జల్లెల్ల శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ బి.రాజులు, జిల్లా మహిళా కార్యదర్శి బి.మంజుల, పూర్వ అధ్యక్షులు ఏ.రామచంద్రం, గజ్వేల్, వర్గల్, జగదేవ్‌పూర్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, విద్యాసాగర్, పర్వతం నర్సయ్య, అక్కారం సత్తయ్య, టిపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు శంకర్, పరమేశ్వర్, మల్లేశం, రాజేశం, శ్రీనివాస్, దీవెన, వేణు, గీతాంజలి, చంద్రం, రాములు, శ్రీనివాస్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

**కోహెడ, డిసెంబరు 30, ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అభిలాష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై కేకులు కట్ చేయరాదని డిజెలు పెట్టకూడదన్నారు. వేడుకలను కుటుంబ సమేతంగా ఇళ్లలోనే సంతోషంగా జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, దాడులు, బెదిరింపులకు పాల్పడం రోడ్లపై వెళ్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలన్నారు.

## వార్డుల విభజనలో ప్రజ్ఞాపూర్‌కు అన్యాయం

### -బిజెపి యువ నేత సల్ల శ్రీనివాస్

**గజ్వేల్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వార్డుల విభజనలో ప్రజ్ఞాపూర్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రజ్ఞాపూర్ బిజెపి యువ నాయకుడు సల్ల శ్రీనివాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా కొత్తగా మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో విస్తరణ పెరిగిందన్నారు. మున్సిపాలిటీలో ఓటర్ల సంఖ్య పెరిగినా వార్డుల సంఖ్యను పెంచలేదన్నారు. 20 వార్డులుగా ఉన్న మున్సిపాలిటీని 30 వార్డులు చేస్తే పరిపాలన సులభతరమవుతుందని అన్నారు. ప్రజ్ఞాపూర్‌లో గతంలో నాలుగువార్డులు ఉన్నప్పటికీ అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రెండు వార్డులుగా మార్చడంతో ఇంకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్‌లో గతంలో కంటే ఓటర్ల సంఖ్య పెరిగిందని, వార్డుల సంఖ్య కూడా పెరుగుతుందని ప్రజలు ఆశించారని, వారి ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. ఇప్పటికైనా వార్డుల పునర్విభజనపై అధికారులు స్పందించి సమీక్షచేసి పరిపాలనకు ప్రజలకు సౌకర్యంగా అనుకూలంగా ఉండేలా శాస్త్రీయబద్ధంగా వార్డుల విభజన చేయాలని కోరారు.

## గ్రామాలకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయండి : ఎంపిడివో రమేష్

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 30, ప్రభాతవార్త :** మండలంలోని కార్యదర్శులు అందరూ ఆయా గ్రామాలలో అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని మండల ప్రజాపరిషత్ అధికారి రమేష్ ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రతీ అధికారి, కార్యదర్శులతో పాటు గ్రామస్థాయిలో పనుల ప్రతిపాదనలు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు తయారుచేసి కార్యాలయంలో సమర్పించాలన్నారు. అంతే కాకుండా సంక్రాంతి వేడుకల సందర్భంగా గ్రామ స్థాయిలో నిర్వహించే ముగ్గుల పోటీలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఎంఈవో బండారి మనీల, ఏపిఎం తిరుపతి, విద్యుత్ శాఖ డీఈ, ఏఈ, ఎంపివో మోహన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## గ్రామీణ విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగిఉంది

**చిన్నకోడూరు, డిసెంబరు 30, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత విద్యార్థులో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని యువనాయకుడు పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవ(శ్రీ రామానుజన్ జయంతి) సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్ష మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం అనేది కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చే ఒక విషయమే కాకుండా జీవితాన్ని సరైన దిశలో నడిపించే ఆలోచనా శక్తిని పెంపొందించే శాస్త్రం అన్నారు. ప్రపంచానికి గణితాన్ని పరిచయం చేసిన మహానుభావుడు శ్రీనివాస రామానుజన్ అని ఆయన జీవితం ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు పోటీ భావనతో కాకుండా జ్ఞానం సంపాదించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పాశికంటి తిరుపతి, సర్పంచ్ ములకల వజ్రమ్మకుంటయ్య, చిన్నకోడూరు హైస్కూల్ హెచ్ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, తెలంగాణ గణిత ఫోరం ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలి

**చిలిపిచెడ్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నర్సాపూర్ మండల సమాఖ్య కార్యాలయంలో చిలిపిచెడ్ ఎస్వీఈపి బ్లాక్ సిఆర్‌పిలకు, సీసీలకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాన్ ఫామ్ యాదయ్య హాజరై సమావేశ ఉద్దేశించి మాట్లాడుతూ నూతన వ్యాపారాల ప్రారంభం మరియు ప్రస్తుత వ్యాపారాలకి కావాల్సిన నైపుణ్యాలు మార్కెటింగ్, రుణ సదుపాయాలు అందించడం కై ఏర్పడిన ఈ ప్రాజెక్టుని సీఆర్పీలు, సీసీలు అకుంఠిత దీక్షతో పనిచేసి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సహకరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఎం యాదయ్య తో పాటు ఎస్వీ ఈపి ఏపిఎం.గౌరీ శంకర్, నర్సాపూర్ కొడిపల్లి ఏపీఎంలో సంగమేశ్వర్, సంగీత, సీసీలు నాగరాజు, రవీందర్, శ్రీకాంత్, ప్రవీణ, సబిత, వెంకటలక్ష్మి, రజిత, భాగ్య, పురుషోత్తం, రమేష్, అకౌంటెంట్ మల్లేశం, మరియు సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## సబ్సిడీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

**మెదక్ టౌన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** జిల్లాలోగల లింగ మార్పిడి (ట్రాన్స్ జెండర్స్) గల వ్యక్తులకు మాత్రమే తెలియజేయునదేమనగా, 2025 28 ఆర్థిక సంవత్సరమునకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ద్వారా 18 సంవత్సరముల నుండి 55 సం.ల మధ్య వయస్సు కలిగి ఉండి ప్రభుత్వము ద్వారా అందించిన ఏదైనా శిక్షణా కార్యక్రమాలలో శిక్షణ పొందిన వారికి మరియు స్వయం ఉపాధి నిమిత్తం చిన్న పాటి చిరు వ్యాపారు నెలకొల్పబోయే లింగ మార్పిడి (ట్రాన్స్ జెండర్స్) గల వ్యక్తులకు రూ. 75,000/ లకు మించకుండా 100!! సబ్సిడీ రూపేనా మంజూరుచేయుటకు ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి మార్గదర్శకాలు జారీచేయడమైనది. కావున 18 సంవత్సరముల నుండి 55 సం.ల వయస్సు కలిగిన లింగ మార్పిడి (ట్రాన్స్ జెండర్స్) గల వ్యక్తులు ఇట్టి పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజుల లోపు లోపు సంబందిత అన్ని ధ్రువపత్రములతో జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ,, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము, మెదక్‌లో దరఖాస్తు చేసుకోవాలి ఇతర వివరాలకై జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, మెదక్ గారిని అన్ని కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరని తెలియజేయడమైనదనీ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు : ఎస్ఐ

**కొండాపూర్ డిసెంబరు 30 ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో వేడుకలు జరపవద్దని ఎస్ఐ సోమేశ్వరీ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బందోబస్తు, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు. ముమ్మరంగా చేపడతామన్నారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు పోలీసుల సూచనలు, పాటించడం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు ప్రమాదాలకు దూరంగా ఉండి పిల్లలు, పెద్దలు అందరూ తమ ఇండ్లలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. డిసెంబర్ 31 రాత్రి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించబడుతుంది. రాష్ డ్రైవింగ్, రాష్ రైడింగ్, బైక్ రేసింగ్, స్టంట్స్ వంటి ప్రమాదకర చర్యలకు ఎవరూ పాల్పడరాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయి. మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికే మూసివేయాలి, మైనర్లకు మద్యం విక్రయించరాదు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం. అదేవిదంగా న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవద్దు. అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చిన న్యూ ఇయర్ మెసేజ్ ఓపెన్ చేయరాదు మరియు ఫార్వర్డ్ చేయరాదు. అత్యవసర పరిస్థితుల్లో దయాల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలను వినియోగించు కోవాలని అన్నారు.

## కొత్త సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**పుల్‌కల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ విశ్వజన సూచించారు. 31 రాత్రికి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తారని, మద్యం తాగి వాహనాలు నడిపినా, రోడ్లపై తిరిగాడిని చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఇళ్లల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాలతో వేడకలు జరుపుకునేలా చూసుకోవాలని ఉమ్మడి పుల్‌కల్ మండల ప్రజలకు సూచించారు.

## నిబంధలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలి

**జహీరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం వేడుకలను డిసెంబర్ 31వ రాత్రి ప్రశాంత వాతావరణంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా పోలీసులు సూచించిన మార్గంలో వేడుకలను జరుపుకోవాలని కోహీర్ ఎస్ఐ నరేష్ మండల ప్రజలకు సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్‌లు చేయకూడదని, మద్యం సేవించి వాహనాలు తోలినా, రోడ్లపై సంచరించినా కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రంక్ ఆండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్షకు గురికావాల్సి వస్తుందన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

## పిఆర్‌టియు టిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**నర్సాపూర్, డిసెంబరు 30. ప్రభాతవార్త:** పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో పిఆర్‌టియు టిఎస్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ మంగళవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. పిఆర్‌టియు టిఎస్ మెదక్ జిల్లా 2026 నూతన క్యాలెండర్‌ను నేడు ఆర్డీవో కార్యాలయం లో ఆర్డీవో మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించినారు. ఈ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మండల విద్యాధికారి తారా సింగ్, పిఆర్‌టియు టిఎస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, నర్సాపూర్ మండల అధ్యక్షులు శ్రీ జ్యోతి , ప్రధాన కార్యదర్శి భీమ్లా నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రసన్న కుమార్, వీరేశం, చెన్నా, రాష్ట్ర కార్యదర్శి కట్ట మల్లయ్య, మండల అసోసియేట్ అధ్యక్షులు ఇంతియాజ్, కార్యదర్శి భీమ్లా నాయక్, మహిళా కార్యదర్శి సరిత, నాగభూషణం, సత్యనారాయణ, జేత్య, పిఆర్‌టియు ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి వ్యాపారస్తుడు లైసెన్స్ కలిగి ఉండాలి మున్సిపల్ అధికారులు

**నర్సాపూర్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఒక్క వ్యాపారి తప్పనిసరిగా వృత్తి వ్యాపార లైసెన్సులు కలిగి ఉండాలని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు నర్సాపూర్ పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించి వ్యాపార సంస్థలను పరిశీలించి తడి పొడి చెత్త పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపార సంస్థలు రోజువారీగా వెలువడే చెత్తను తప్పనిసరిగా తడి పొడిగా వేరుచేసి వారి కోసమే ఏర్పాటు చేసిన కమర్షియల్ వాహనానికి అందజేయాలని అన్నారు. అలా కాకుండా చెత్తను బహిరంగంగా పడవేసిన కాల్చివేసిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా వ్యాపారస్తులు వృత్తి వ్యాపార లైసెన్సులు కలిగి ఉండాలని ఈ లైసెన్సులు లేనియెడల అట్టి వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సాపూర్ పట్టణమంతా పరిశుభ్రంగా ఉంచడానికి వ్యాపార సంస్థల ప్రతినిధులతో పాటు పుర ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారులు జవాన్లు, జీన్స్, జనార్దన్, అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రత్యేక బందోబస్తు

## సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అవినాష్



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

**టేక్మాల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బోడ్మట్‌పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్‌కుమార్‌కు చోటుదక్కింది. మంగళవారం హైదరాబాదులో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శిగా తలారి అవినాష్ కుమార్‌కు నియామక పత్రాన్ని రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సాధాని భూమన్నయాదవ్ రాష్ట్ర అధ్యక్షులు కథాయి ఆశాదీప్‌రెడ్డి నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా తలారి అవినాష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ కు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు, టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, కమిటీకి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకరప్పకు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిస్తే తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి మరో పదవిని కట్టబెట్టి బాధ్యతను పెంచారాని వారి నమ్మకాన్ని అమ్ము చేయకుండా రాష్ట్ర సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

**నర్సాపూర్, డిసెంబరు 30. ప్రభాతవార్త:** నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థి అక్షయ్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బలరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల కళాశాల విద్యార్థి అక్షయ్ కుమార్ ఈనెల 11న మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియం లో జరిగిన తెలంగాణ క్లాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్లో పాల్గొన్నాడని తెలిపారు. ఈ క్లాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో అండర్ 18 కేటగిరిలో 6 కే ఏం లో పాల్గొని ద్వితీయ స్థానం పొందాడని తెలిపారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన అక్షయ్ కుమార్ వచ్చేనెల జనవరి రెండవ తేదీన హైదరాబాద్లోని గచ్చిబౌలి లో జరిగే ఈ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన గురుకుల విద్యార్థి అక్షయ్ కుమార్ ను గురుకుల కళాశాల ప్రిన్సిపల్ బలరాం, వైస్ ప్రిన్సిపల్ బాలరాజు, పిడి లక్ష్మణ్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## న్యూఇయర్ వేడుకలకు ప్రత్యేక బందోబస్తు

### సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:** డిసెంబర్ 31న జరుపుకునే న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రజల, ఆస్తుల రక్షణ కోసమై ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 31 న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రజల ప్రాణాలు ఆస్తుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ లో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పట్టుబడితే జరిమానాలతోపాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా భద్రతతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ జాన్ రెడ్డి ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డిలు సూచించారు.

## సర్పంచ్‌లను సన్మానించిన మాజీ మంత్రి

**జహీరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండల పరిధిలోని గౌసాబాద్ గ్రామంలో నూతనంగా సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనసూజ నందప్పకు మంగళవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి చంద్రశేఖర్ హాజరై నూతన సర్పంచ్‌ను సన్మానించి అభినందించారు. గ్రామాభివృద్దే లక్ష్యంగా పాలన సాగించాలని, అందుకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి, గౌసాబాద్ సర్పంచ్‌లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా హాజరైన భక్తులు

## భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

**సంగారెడ్డి మున్సిపాలిటీ డిసెంబర్ 30 ప్రభాతవార్త:** మంగళవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లాలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ఉత్తరద్వార దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలోని పలు ఆలయాల్లో ఈ వేడుకలను కన్నుల పండగగా నిర్వహించారు.

**తెల్లవారుజాము నుంచే ఉత్తరద్వార దర్శనం..**

జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 5 గంటలకు మంగళవాయిద్యాలతో వేద మంత్రోచ్ఛారణల నడుమ వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. సంగారెడ్డి సమీపంలోని వైకుంఠపురం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చకుడు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో వేకువజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులు ఆయన కుటుంబ సభ్యులు స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. సంగారెడ్డి ప్రాంతం నుంచే కాకుండా హైదరాబాద్, జహీరాబాద్, సదాశివపేట జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వైకుంఠపురం వెంకటేశ్వరుడి దర్శనానికి బారులు తీరారు.

**శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో...**

**వర్గల్, డిసెంబరు 30 (ప్రభాతవార్త):** వర్గల్ శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో తెల్లవారుజామున ఉత్సవానికి శ్రీకారంచుట్టగా, వేద పండితులు మంత్రోశ్చరణల మధ్య భూదేవి, శ్రీదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకం, లక్ష తులసి అర్చన, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. అలాగే భక్తులకు శ్రీస్వామివారు ఉత్తర ద్వార దర్శనం కల్పించగా, క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి కళ్యాణ వేదికపై అధిష్టింప జేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం, ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాల సమర్పణ, మాంగల్యధారణ తదితర దృశ్యాలు భక్తులను కనువిందు చేయగా, స్వామివారి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈకార్యక్రమాల్లో వేదపండితులు బాలఉమామహేశ్వర శర్మ, ఆలయ నిర్మాణదాత, వాసు గ్రూప్స్ చైర్మన్ శ్రీనివాస్‌గుప్త, ఆలయ కమిటీ నిర్వాహకులు యాయవరం రాజ శేఖరశర్మ, సత్యనారాయణ, దాచేపల్లి వెంకటకృష్ణా రావు, మల్లారెడ్డి, సుధాకర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు. కాగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

**సంజీవ్‌రావుపేటలో...**

**నారాయణఖేడ్, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సంజీవ్‌రావ్‌పేట్‌లోగల శ్రీలక్ష్మి అనంతపద్మనాభస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం అనంతపద్మనాభ స్వామికి 108 కొబ్బరి బోండాలతో మహ అభిషేకం చేయడం జరిగింది. ఆలయ ప్రధాన పూజారి ప్రవీణ్ పంతులు గారిచే శ్రీ అనంతశైనికి మహా మంగళ హారతి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనీష్‌రాజ్ దేశ్‌ముఖ్ ప్రధాన పూజారి ప్రవీణ్ పంతులు గ్రామ పెద్దలు యువకులు ప్రజలు పాల్గొనడం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు కూడా అందించడం జరిగింది.

**మెదక్ పట్టణంలో...**



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**మెదక్ టౌన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** పట్టణంలోని వెంకటేశ్వర స్వామి, కోదండ రామాలయలకు భక్తులు పోటెత్తి ఉత్తర దర్శనం ద్వారా లోపలికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకలు సందర్భంగా కోదండ రామాలయ కమిటీ సభ్యులు, వెంకటేశ్వరాలయ కమిటీ నేతృత్వంలో వైకుంఠ ద్వారాన్ని నిర్మించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

**తెల్లవారుజాము నుంచే ఉత్తరద్వార దర్శనం.....**

జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో మంగళవారం తెల్లవారు జామున 4 గంటల నుంచే ఉత్తర ద్వారదర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో ఉదయం 3.30 గంటలకు శ్రీ సీతారాములస్వాముల వారి మూలవిరాట్టులకు మహాభిషేకం, నివేదన, మంత్ర పుష్పం, తదితర విశేష పూజలు నిర్వహించారు. 4 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద పుష్ప వేదికపైన ఆసీనులై ఉన్న స్వాములకు ప్రత్యేక పూజలు, సహస్రనామార్చనలు, సప్తహారతుల సమర్పణ, మంత్ర పుష్పం, అనంతరం వేదఘోష, మహాశ్విరాదం నిర్వహించి. ఉదయం 5 గంటలకు మంగళవాయిద్యాలతో వేద మంత్రోచ్చారణల నడుమ వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డిఓ రమాదేవి, తదితర రాజకీయ ప్రముఖులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు



మల్లికార్జున స్వామి హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీలను మంగళవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. రూ.1,15,42,056 నగదు, 60 గ్రాముల మిశ్రమ బంగారం, 005కిలో 500 గ్రాముల మిశ్రమ వెండి, 50 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ ఈవో వెంకటేష్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాలయ అధికారులు పి.విజయలక్ష్మీ, బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఫెస్టివల్ కమిటీ సభ్యులు గంగ నర్సింహారెడ్డి, సార్ల లింగం, చిగిరి కొమురయ్య, ఎల్లయ్య, గొరిగే రవి, ఎన్.సత్యనారాయణ, వి.వరలక్ష్మీనాగరాజు, మల్లేశం, మహేష్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్వర్ణకారుడు నర్సింహాచారి, ఎస్‌బిఐ సిబ్బంది, శ్రీ లలిత సేవ సమితి సేవ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**కొండపాక, డిసెంబరు 30, ప్రభాతవార్త :** యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బిఆర్ఎస్ నేత అనంతుల ప్రశాంత్ అన్నారు. మంగళవారం కొండపాకలోని నివాసంలో స్పోర్ట్స్‌లో మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిమ కనబరిచిన సందర్భంగా ఆయన వారిని అభినందించారు. అనంతరం వారు ప్రతిరోజు ప్రాక్టీస్ చేయడానికి స్పోర్ట్స్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడల్లో యువత ముందుండలని అయన అకాంక్షించారు.

## ముక్కోటి ఏకాదశి మూడుకోట్ల ఏకాదశులతో సమానం

**-ఆలయ నిర్మాణం ఫౌండర్ బిచ్చప్ప**

**పెద్దేముల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ముక్కోటి ఏకాదశి మూడుకోట్ల ఏకాదశులతో సమానమని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయనిర్మాణ ఫౌండర్ బిచ్చప్ప అన్నారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఖాంజాపూర్‌గుట్ట సమీపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామిని వైకుంఠ ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శనం చేసుకున్నారు. స్వామివారికి అభిషేకం, మహాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌కాలనీ, ఇందిరమ్మకాలనీ, ఖాంజాపూర్, కందనెల్లి, తాండూరు నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ సభ్యులు పంతులు మల్లికార్జున స్వామి, ఆంజనేయులు, విజయకుమార్, చల్లా నర్సిములు, నగేష్, శివారెడ్డి, క్రిష్ణయ్య, శ్రీధర్, రఘు, శివకుమార్, బంటు రవిందర్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్, ధనుంజయ, నాగరాజు, రాము, రవి పాల్గొన్నారు.

## వెంకటాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి భక్తుల తాకిడి


పూజల్లో పాల్గొన్న టి.వజ్రేశ్‌యాదవ్ తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంఛార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్‌లు ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. స్వామివారిని దర్శించుకున్న ముఖ్యుల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేశ్, నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నీరుడి శ్రీనివాస్‌ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ చింతపంటి సత్తయ్యయాదవ్, డైరెక్టర్లు ఊదారి వెంకటేశ్, ఆంజనేయులు, బండారి సుధాకర్, లావణ్య, ఊదారి వేణుగోపాల్, కట్టా సత్యనారాయణగౌడ్, ఊదారి హరిబాబు తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
జిల్లెడు చౌదరిగూడ మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన పదవతరగతి విద్యార్థిని నక్షత్ర గణితం టాలెంట్‌టెస్టులో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. జిల్లాస్థాయి టాలెంట్‌టెస్టులో ప్రతిభ కనబరచడం వల్ల రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా నక్షత్రను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## గీతాపారాయణంతో మారుమ్రోగిన వికారాబాద్


గీతాపారాయణం చేస్తున్న గీతావాహిని సభ్యులు

**వికారాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా గీతావాహిని ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని గణేష్‌కట్ట, మైసమ్మగుడి, శివాజీనగర్ వద్ద గీతాపారాయణం నిర్వహించారు. గీతావాహిని సభ్యులు వివిధ ఆలయాలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం చేసుకుని గణేష్‌కట్ట వద్ద పారాయణంలో పాల్గొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గీతావాహిని ఆధ్వర్యంలో వివిధ పుణ్యక్షేత్రాలలో సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమం చేయడం జరిగిందని, దీనిలో భాగంగా వచ్చే యేడాది జనవరి 19న 85మంది గీతావాహిని సభ్యులచే ద్వారకాలో సంపూర్ణభగవద్గీత పారాయణానికి బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి గీతాపారాయణంలో గీతావాహిని కమిటీ సభ్యులు శ్రీదేవి, లావణ్య, విజయ, మాధురి, సునీత, స్వాతి, ఝాన్సీరాణి, నీరజ, నాగరాణి, వరలక్ష్మి, మమత, లక్ష్మి సరల, సరిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు తరలిన స్వాములు

**-అయ్యప్పస్వామి దేవాలయంలో ఇరుముడుల కార్యక్రమం**


శబరిమలకు తరలివెళ్తున్న అయ్యప్పస్వాములు

**కొడంగల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
అయ్యప్పస్వామి మాలధారణతో 41రోజులపాటు నియమనిష్ఠలతో అయ్యప్ప నామస్మరణతో పూజలు నిర్వహించిన అయ్యప్పస్వాములు అయ్యప్పస్వామి దర్శనార్థం శబరిమలకు బయలుదేరారు. మంగళవారం ఉదయంవేళల్లో పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వాములు ఉమాపతిగౌడ్, గోపాల్, బుక్క విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సుమారు 5గంటలపాటు అయ్యప్ప నామస్మరణలతో ఇరుముడి కార్యక్రమం అనంతరం తలపై ఇరుముడులతో వివిధ వాహనాల్లో శబరిమలకు తరలివెళ్ళారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన గంట వెంకటయ్యగౌడ్ అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

## వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం


పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

**కొడంగల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చిట్లపల్లి క్లస్టర్, అప్పాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కేంద్ర గణాంక అధికారి ప్రభాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి ఐజాక్ హెరాల్డ్‌లతో కలిసి వరిపంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. పంటకోత ప్రయోగం 5'5 ప్లాట్‌లోచేసి ఆ ప్లాట్ విస్తీర్ణంలో ఉన్న పంట మార్చి, ఆ విత్తనం తూకం వేస్తారని దీనివల్ల ఒక ఎకరాలో వచ్చే పంట దిగుబడి, దానివల్ల గ్రామంలో పండించిన వరిపంట ఎకరాల వారిగా దిగుబడిని అంచనా వేయగలమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌తో పాటు రైతులు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌కు డిసిపి అధికారి ఏర్పాటు

**-షాద్‌నగర్ డిసిపి జోన్ పరిధిలో 9మండలాలు**
**-షాద్‌నగర్, ఆమన్‌గల్ ప్రాంతాలకు వేరువేరుగా ఇద్దరు ఏసిపిలు**

**షాద్‌నగర్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పోలీస్ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరణ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలోకి షాద్‌నగర్ చేరింది. రాష్ట్రప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్‌లో షాద్‌నగర్, ఆమన్‌గల్‌లను కలిపి ఒక డిసిపి జోన్‌గా ఏర్పాటు చేశారు. ఇందులో షాద్‌నగర్ డిసిపి జోన్ హెడ్ క్వార్టర్ కార్యాలయంగా ఉండడం విశేషం. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్‌సిటీ కోసం కొత్త కమిషనరేట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు షాద్‌నగర్‌కు కొత్తగా డిసిపి అధికారి నియామకం జరుగుతుంది. షాద్‌నగర్ డిసిపి జోన్ పరిధిలో మొత్తం తొమ్మిది మండలాలు చేరాయి. ఇందులో షాద్‌నగర్ ఏసిపి పరిధిలో చౌదరిగూడెం, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాలుండగా, ఆమన్‌గల్ ఏసిపి పరిధిలో ఆమన్‌గల్, కేశంపేట, మాడుగుల, తలకొండపల్లి మండలాలు ఉన్నాయి. అయితే నియోజకవర్గంలోని కేశంపేట మండలం ఆమన్‌గల్ ఏసిపి పరిధికి వెళుతుంది. మిగతా పోలీస్‌స్టేషన్లను షాద్‌నగర్ ఏసిపి పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం ఈనూతన నిర్ణయం తీసుకోవడంతో గతంలో నందిగామ, కొత్తూరు మండలాలకు శంషాబాద్ ఏసిపి పరిధినుండి విముక్తి లభించినట్టు అయింది.

**ప్రజలకు మెరుగైనసేవలు: ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్**
షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు శాంతిభద్రతలలో మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీతో ఈప్రాంతాన్ని అనుసంధానం చేయడం ఆసక్తికర పరిణామం అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గతంలో నందిగామ కొత్తూరు ఈ నియోజకవర్గం నుండి వేరుగా శంషాబాద్ ఏసిపి పరిధికి వచ్చేవని ఇప్పుడు షాద్‌నగర్ హెడ్‌క్వార్టర్‌గా డిసిపి అధికారి కార్యాలయం ఏర్పాటుకావడం సంతోషించదగ్గ పరిణామం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేసిన ప్రభుత్వం భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషమని చెప్పారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

**మర్పల్లి డిసెంబరు 30, ప్రభాతవార్త:**
బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామప్రజలు సమాకరించాలని మర్పల్లి ఎస్సై అబ్దుల్ రాహెూఫ్ సిరిపూరం వార్డెన్ తుల్జారాంగౌడ్‌లు అన్నారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటుచేసిన పౌరహక్కుల దినోత్సవం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. బాల్యవివాహాలు, బాలకార్మికుల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. బాల్యవివాహాలు చేస్తే, అలాంటివారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని వారన్నారు. పౌరులు తమహక్కులతోపాటు బాధ్యతలు కూడా స్వీకరించాలని వారు పేర్కొన్నారు. గ్రామంలో కులమతాలకతీతంగా అందరు కలసిమెలిసి జీవించాలని కోరారు. గ్రామసర్పంచ్ రాజు, జిపిఆర్‌ఓ అనిల్ కుమార్ గ్రామకార్యదర్శి సుజాత, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కల తొలగింపు


రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు తొలగింపచేస్తున్న సర్పంచ్ రాంచంద్రయ్య

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
జిల్లెడు చౌదరిగూడ మండలంలో మంగళవారం రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తూంపల్లి సర్పంచ్ రాంచంద్రయ్య తొలగింపచేసారు. మండలంలోని లాల్‌పహాడ్ నుంచి చౌదరిగూడ వచ్చే రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు మొలిచి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని గమనించిన సర్పంచ్ జెసిబితో మొక్కలు తొలగింపచేసారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులున్నారు.

## పరిగి బిఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


బిఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి

**పరిగి, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
పరిగి నియోజకవర్గం పూడూరు మండల కేరవెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అలీ పార్టీ కార్యకర్తలతో కలిసి బిఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు కేరవెల్లి గ్రామం నుండి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఇంటివరకు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారుగా 200మంది కాంగ్రెస్‌పార్టీని వీడి బిఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. ఈసందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడంతోనే బిఆర్‌ఎస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయి. రైతుబీమాకు, రైతుబంధుకు ఎగవేతపెట్టిందని, రాబోయే ఎన్నికలలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పకుండా వస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి తెలిపారు. టిఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, వివిధ మండలాల మాజీ సర్పంచులు ఎంపిటిసిలు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

## మానవత్వం చాటుకున్న ఆర్బిఓఎల్ ఎండి

**కుల్కచర్ల, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
పేద కుంటుంబాలకు అండగా ఉంటామని ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మందడి గోపాల్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసున్న ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళశ్రీనివాస్‌రెడ్డి వెంటనే మందడి గోపాల్ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పేదకుటుంబాలకు ఎల్లాప్పుడు అండగా ఉంటామని సరళాశ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

## ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే


ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**కుల్కచర్ల, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిధుల ద్వారా రూ.5లక్షలతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే రైతులు, కార్మికులకు శుద్ధిచేసిన తాగునీరు అందుబాటులో ఉండటం ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, చౌడపూర్ మండల అధ్యక్షులు అశోక్ కుమార్, డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్, సీనియర్ నాయకులు కృష్ణరెడ్డి, బచ్చిరెడ్డి, అయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామప్రజలకు భద్రత కల్పించిన సర్పంచ్


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సిఐ నరహరి, సర్పంచ్ భాస్కర్‌గౌడ్

**కేశంపేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లేమామిడి గ్రామం నుండి నిర్దవెల్లి వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురై ప్రమాదభరితంగా మారి, ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే టూవీలర్, ఫోర్‌వీలర్ ప్రయాణికులు, నిర్దవెల్లి గ్రామస్థులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని భయభయంగా ప్రయాణించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ రోడ్డు నిర్మించినప్పుడు వరదనీరు ప్రవహించేందుకు వీలుగా కల్వర్టు నిర్మించకపోవడంతో వర్షాలుకురిసిన ప్రతిసారి రోడ్డు కోతకుగురై గ్రామస్థులను ఇబ్బందులకు గురిచేసింది. లేమామిడి నిర్దవెల్లి గ్రామాల ప్రజలు సమస్యలు ఎన్నిసార్లు గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరు పట్టించుకోలేదని నిర్దావెల్లి ప్రజలు వాపోయారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గ్రామ సర్పంచిగా ఎన్నికైన చెదురువెల్లి భాస్కర్‌గౌడ్ మంగళవారం కోతకుగురైన ప్రదేశంలో ట్రాక్టర్లతో మట్టిని నింపి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ భాస్కర్ తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో నిర్దవెల్లి గ్రామస్థులు, అటుగా ప్రయాణించేవారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతాన్ని స్థానిక సిఐ నరహరి సందర్శించి సర్పంచ్ భాస్కర్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో వార్డ్‌సభ్యులు రొయ్యల మంజులజంగేష్, చంద్రయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్త శ్రీశైలం, మాజీ డిప్యూటీ సర్పంచ్ ఖాజాపాషా, నాయకులు బద్కు మల్లయ్య, దిద్దెల ముత్యాలు, కొత్త చిన్న శ్రీశైలం, ఆకుల రామకృష్ణ, దిద్దెల బాలస్వామి, ఎండి బద్రుద్దీన్, నరేష్, శివశంకర్, చంద్రశేఖర్, సురమోని బాలస్వామి, ఆకుల గోపాల్, కటికే మహేష్, దిద్దెల రాజు, బోడ రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనురాగ్‌లో విజయవంతంగా ముగిసిన సెల్స్‌ఫోర్స్ ఏజెంట్‌ఎక్స్ హ్యాకథాన్ బూట్‌క్యాంప్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ఆధునిక సాంకేతికతలపై లోతైన అవగాహన కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి సెల్స్‌ఫోర్స్ బ్యూట్ క్యాంప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సెల్స్‌ఫోర్స్ డెవలపర్ సునీల్‌కుమార్ తరువు అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజులపాటు జరిగిన సెల్స్‌ఫోర్స్ ఏజెంట్‌ఎక్స్ హ్యాకథాన్ బూట్‌క్యాంపు ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. అనురాగ్ యూనివర్సిటీ ఐటి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాకథాన్‌కు పలువురు సెల్స్‌ఫోర్స్ నిపుణులు హాజరై, విలువైన అవగాహనను కల్పించారు. ఈ బ్యూట్‌క్యాంప్‌లో భాగంగా హ్యాండ్స్ ఆన్ సెషన్లు, లైవ్ డెమోలు, సమస్యల పరిష్కారాలు నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిఎక్స్ సెల్స్‌ఫోర్స్ డెవలపర్ గ్రూపు హైదరాబాద్ ప్రతినిధి జాష్వా, ఐటి విభాగాధిపతి నితీశ్ శర్మ, వికాశ్ బండారు, జి.శేఖర్‌రెడ్డి, జిఎల్.ఆనంద్‌బాబు, పృధీరాజ్‌గౌడ్, ఐ.మహేశ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

**-వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా**


సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా

**వికారాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా అన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నూతన సంవత్సర వేడుకల్లో డీజేలకు అనుమతిలేదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు, వాహనతనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలు కాపాడేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీస్ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాల యజమా నులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అ నుమతి తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వేడుకల పేరుతో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమమద్యం సరఫరా, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం సరఫరాచేస్తే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. అత్యుత్సాహంతో అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై అతివేగంగా వెళ్లడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం వంటి ప నులు చేయవద్దని, వీటిని షీ టీమ్ అధికారులు నిశితంగా గమనిస్తారని పేర్కొన్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించడం పూర్తిగా నిషేధమని, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లపరిధిలో ప్రత్యేకబృందాలతో కలిసి డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించి, వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

## ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ వేడుకలు


ఎస్‌ఎఫ్‌ఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**పరిగి, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
విద్యార్థి పోరాటాల వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరిగి పట్టణకేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరణచేశారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్, వరుణ్, శివశంకర్, కలిమ్, చేరణ్, గణేష్, సుమీర్, రియాజ్, షాహిద్, తలహా, ప్రవీణ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ


పిఆర్‌టియుటిఎస్ క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ జమదగ్ని

**కీసర, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
పిఆర్‌టియుటిఎస్ కీసర మండల శాఖ క్యాలెండర్ 2026ని మండల వనరులకేంద్రంలో మంగళవారం ఎంఈఓ జమదగ్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌టియుటిఎస్ సంఘం ఉపాధ్యాయుల సమస్యలపరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈసందర్భంగా ఆయాపాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వివిధ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతన క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వేదవతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా బాధ్యులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్దన్, మండల బాధ్యులు శ్రీనివాస్, వెంకటరమణరెడ్డి, సుధాకర్, శశిరేఖ, జ్యోత్స్న, కొండల్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మహేష్‌కుమార్

**ధారూరు, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
ధారూర్ మండలపరిధిలోని ఆవుసుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య ను అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శివలీల, ఉపసర్పంచ్ రాధిక వెంకటేష్, ఆయా అండాల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



ఫౌండేషన్‌సభ్యులు, వైద్యులు, కమిషనర్, నాయకులు పాల్గొన్న దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
అలియాబాద్ గ్రామంలో గ్రాన్యువల్స్, ఎఐజి, యుసి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు రొమ్ముక్యాన్సర్‌పై ఉచిత శిబిరం నిర్వహించి వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి అవగాహన కల్పించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలకు రొమ్ముక్యాన్సర్‌పై మహిళలకు ఉచితంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలకు రొమ్ముక్యాన్సర్‌పై పరీక్షలు కూడా నిర్వహించారు. ఈశిబిరంలో సుమారు 100మంది మహిళలకు పరీక్షలుచేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మాజీ సర్పంచి కె.కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు పి.రవీందర్, కిష్టప్ప, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయనిధి గొప్ప వరం

**-డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్**

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని డిసిసి అధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ గ్రామానికి చెందిన మంద విజయ్‌కుమార్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందగా సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 60వేల రూపాయల చెక్కును మంగళవారం యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపాల వినోద్‌కుమార్ సమక్షంలో బాధితుడికి వజ్రేశ్ యాదవ్ అందజేశారు. ఈసందర్భంగా వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ బాధలో ఉన్నవారికి భరోసా సిఎం సహాయనిధియని అన్నారు. అనారోగ్యానికి గురైన నిరుపేదల కుటుంబానికి సిఎం సహాయనిధి ఎంతో ఆసరా అవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**-మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన గ్రామనాయకులు**

**కేశంపేట, డిసెంబరు 30, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన దిద్దెల జంగయ్య సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. దీంతో గ్రామంలో తీవ్రవిషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబపెద్దను కోల్పోయినవారి పరిస్థితి హృదయవిదారకంగా మారింది. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే గోగు వెంకట్‌నారాయణరెడ్డి గ్రామ మాజీ సర్పంచ్, శ్రీశైలంగౌడ్, జైపాల్‌రెడ్డిలు మృతుని నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం గోగు వెంకట్‌నారాయణరెడ్డి రూ.5,000, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ రూ.3,000, జైపాల్‌రెడ్డి రూ.10,000, జాంగిర్‌స్వామి రూ.5000ల ఆర్థికసహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థికసాయం అందించిన పెద్దలందరికీ ధన్యవాదాలు అని మృతుడు జంగయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు.